సాక్షి పెద్దపల్లి

మంగళవారం | 24 | జనవరి | 2023



బాలికల ఆత్మరక్షణకు శిక్షణ

బాలికలు ఆపదలో ఉన్నప్పుడు ఆత్మరక్షణకు జిల్లాలోని పాఠశాలల్లో కరాటే పోటీలు మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నారు. 8లో▸



సీఎస్‌ను కలిసిన 'కోలేటి'

గోదావరిఖని: రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారిని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్ సోమవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
31.0 /16.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఉద్యోగులకు నేత్రపరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులకు సోమవారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. కంటివెలుగులో భాగంగా సోమవారం నుంచి బుధవారం వరకు ఉద్యోగులకు ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంగీత ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు తొలిరోజు ఆర్అండ్‌బీ, డీఆర్‌డీఏ, ఎస్సీ కార్పొరేషన్, విద్యాశాఖ, ఆడిట్‌విభాగం, సర్వే ల్యాండ్‌రికార్డులు, ట్రెజరీ శాఖ ఉద్యోగులకు ముందుగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. తరువాత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు అందించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, ఏవో ప్రసాద్, నోడల్ అధికారి మహేందర్, డాక్టర్ మమత, వంశీకృష్ణ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

పెద్దపల్లిరూరల్: మధ్యాహ్న భోజనవర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట వర్కర్లు నిరసనకు దిగారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేశ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీలు, ప్రభుత్వ వసతిగృహాలకు అందిస్తున్న తీరున ప్రభుత్వ పాఠశాలలకు కూడా నిత్యావసర సరుకులు, కోడిగుడ్లను సరఫరా చేయాలని కోరారు. మార్కెట్ ధరలకు ప్రభుత్వం చెల్లిస్తున్న ధరలకు పొంతనే లేదన్నారు. బకాయి వేతనాలను చెల్లించాలన్నారు. కళావతి, లక్ష్మి, యశోద, వెంకటలక్ష్మి, సునీత, పుష్పలత, రమాదేవి, ఆగమ్మ, రాజేశ్వరి, తిరుపతి, సరోజన పాల్గొన్నారు.

నగరపాలక ఇంజినీర్లు బదిలీ

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్ విభాగంకు చెందిన ఇద్దరు ఇంజినీర్లను సోమవారం బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఈఈగా పని చేసిన డీఈ యాదగిరిని నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. అలాగే ఇప్పటి వరకు సిరిసిల్ల మున్సిపాలిటీలో డిప్యూటేషన్‌లో పని చేస్తున్న ఈఈ జి.సుచరన్‌ను, ఆదిలాబాద్ మున్సిపాలిటీకి బదిలీ చేశారు. అలాగే జీహెచ్ఎంసీలో ఈఈగా పని చేస్తున్న మహామూద్‌మియాను రామగుండం బల్దియాకు బదిలీ చేశారు.

ప్యాకేజీ టెండర్లు రద్దు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో క్లాస్‌వన్ కాంట్రాక్టర్లకు ప్యాకేజీ టెండర్లను రద్దుపరచి, స్థానికంగా ఉన్న కాంట్రాక్టర్లకే అప్పగించేలా చూడాలని కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సంగీతను కౌన్సిలర్లు నూగిల్ల మల్లయ్య, సంపత్, తూముల సుభాష్‌రావు, నాయకుడు శ్రీమాన్ కలిసి వినతిపత్రం అందించారు. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు అధికారపార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో 60మంది రిజిస్టర్డ్ కాంట్రాక్టర్లున్నారని వారికి పనులు దక్కకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు యత్నిస్తున్నారని వివరించారు. కలెక్టర్ చొరవ తీసుకుని ప్యాకేజీ టెండర్లను రద్దుపరచి ప్రజాధనాన్ని కాపాడాలని కోరారు.

ఉపాధ్యాయుల అరెస్ట్ అక్రమం

పెద్దపల్లిరూరల్: ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి రోడ్డెక్కితే అరెస్టులు చేయడం అన్యాయమని టీటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి రవికుమార్, మన్సూర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రసాధనలో ఉపాధ్యాయులు పాత్రకూడా ఉందనే విషయాన్ని ప్రభుత్వం మరవొద్దన్నారు. పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్ చేయాలన్నారు. 317జీవో ద్వారా ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందన్నారు. ఉపాధ్యాయులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.



గతంలో నిర్వహించిన దిశ దిశ కమిటీ సమావేశం (ఫైల్)

'దిశ' తప్పుతోంది..!

- దశ– దిశ సమావేశం జరిగి 27నెలలు
- 2020 అక్టోబర్ 20న చివరి సమావేశం
- కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష కరువు
- ప్రతిపాదనల రూపకల్పనలో కొరవడిన అధికారుల చొరవ

సాక్షి, పెద్దపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమీక్షించే దిశ సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారని జిల్లా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. కేంద్రం నుంచి మంజూరైన నిధులు, క్షేత్రస్థాయిలో పనుల పరిస్థితిపై ఈ సమావేశంలో చర్చిస్తారు. సమావేశానికి ఎంపీ అధ్యక్షత వహిస్తారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సిన సమావేశం జిల్లా ఏర్పడినప్పటినుంచి ఒక్కసారి మాత్రమే జరిగింది. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై జరగాల్సిన దిశ సమీక్షను పట్టించుకునే వారే కరువయ్యారు.

ఎంపీ అధ్యక్షతన..

జిల్లా ప్రగతి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఎంపీ అధ్యక్షతన నిర్వహిస్తారు. జిల్లా కలెక్టరుతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్, మున్సిపాలిటీ చైర్మన్లు, నామినేటెడ్ సభ్యులు, కేంద్ర పథకాలు అమలు చేస్తున్న ఆయాశాఖల జిల్లా అధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, కేంద్రం నిధులతో కొనసాగుతున్న పనులపై విస్తృతస్థాయిలో చర్చిస్తారు. దిశ సమావేశంలో కేంద్రం పరిధిలో ఉన్న 29శాఖల పనితీరుపై సమీక్ష జరగాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఉన్న పురోగతిని సమీక్షించి కొత్తగా చేపట్టాల్సిన పనులు గురించి చర్చించాల్సి ఉంటుంది. అధికారులు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలిదుంటుంది. ఆ దిశగా అడుగులు పడిన దాఖలాలు జిల్లాలో కనిపించడం లేదు. పెద్దపల్లి ఎంపీగా వెంకటేష్‌నేత ఎన్నికైన తర్వాత జిల్లాలో దిశ కమిటీ సమావేశం 20 అక్టోబర్ 2020న జరిగింది. 27 నెలలు గడుస్తున్నా వీటి ఊసేలేదు. ప్రతి మూడు నెలలకోసారి సక్రమంగా నిర్వహిస్తే కేంద్ర ప్రథకాల అమల్లో వేగం పెరగడంతో పాటు నాణ్యత లేమి తప్పే అవకాశం ఉంటుందన్న భావన ప్రజల్లో వ్యక్తం అవుతోంది.

గతంలో ఎప్పుడంటే..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఐదేళ్ల కాలవ్యవధిలో ఉమ్మడి కరీంనగర్ దిశ కమిటీ సమావేశాలు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఖచ్చితంగా జరిగేవి. గతంలో జిల్లాశాఖ ఉన్నతాధికారులు కూడా తరచూ ఇతర జిల్లాలతో పోల్చుతూ విషయం వెల్లడించేవారు. జిల్లాల పునర్విభజన తర్వాత కూడా సమావేశాలు పలుమార్లు నిర్వహించారు.

డీఆర్‌డీవో శాఖనే కీలకం

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుతెన్నులపై దిశ సమీక్ష చేయడం సహజం. ఈ సమావేశం నిర్వహించేందుకు డీఆర్‌డీవో సమన్వయం చేస్తోంది. వాస్తవానికి సంబంధింతశాఖ కూడా కేంద్ర ప్రభుత్వం అమలు చేసేశాఖల్లో ఒకటి. కానీ ఈ శాఖనే పూర్తిగా దిశా నిర్దేశం చేయాల్సి ఉంటుంది. స్వతంత్రంగా వీరికి సమావేశం నిర్వహించే వెసులుబాటు లేదు. కానీ కమిటీ సమావేశంలో ప్రతి అజెండా కాపీలను సభ్యులకు చేర్చాలి. అజెండా అంశం పై చోటు చేసుకున్న చర్చను నమోదు చేయాలి. తర్వాత దానిని పరిశీలించి, సమస్య మరోసారి తలెత్తకుండా దానిని పరిష్కరించాలి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ సమావేశం త్వరగా నిర్వహించి పనులు పురోగతి సాధించేలా చూడాలని జిల్లావాసులు కోరుతున్నారు. ఇదే విషయమై ఎంపీ వెంకటేష్‌నేత వివరణ కోరగా ఉన్నాతాధికారులతతో మాట్లాడి త్వరలో దిశ కమిటీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

దిశ కమిటీలో చర్చించే అంశాలు

కేంద్ర పథకాల్లో లోటుపాట్లను ఎత్తిచూపడంతో పాటు కేంద్ర విజిలెన్స్‌కు రిపోర్టు పంపే అధికారం దిశ కమిటీకి ఉంటుంది.

- మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం
- దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన
- దీన్‌దయాళ్ ఉపాధ్యా గ్రామీణ్ కౌశల్యయోజన
- జాతీయ సామాజిక భద్రతా పథకం
- ప్రధానమంతి అవాస్ యోజన, గ్రామీణ ఆవాస్‌యోజన
- స్వచ్ఛ భారత్ మిషన్(అర్బన్)
- స్వచ్ఛ భారత్(గ్రామీణ)
- సర్వశిక్షా అభియాన్
- జిల్లా గ్రామీణ మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం
- ప్రధాన మంత్రి కృషి సంచాయ్ యోజన
- డిజిటల్ ఇండియా భూమి రికార్డులు, కంప్యూటరీకరణ
- దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన
- శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అర్బన్ మిషన్
- ఉజ్వల్ డిస్క యోజన, ఉదయ్, అమృత్
- పీఎం ఫసల్ బీమా యోజన
- నేషనల్ హెల్త్ మిషన్
- జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ
- మధ్యాహ్న భోజన పథకం
- ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన తదితర పథకాలు అమలు తీరు పై చర్చించాల్సి ఉంటుంది.

పర్సంటేజీ కోసం కార్పొరేటర్ హల్‌చల్?

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో సివిల్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఇంటికి ఆదివారం రాత్రి ఓ కార్పొరేటర్ తన అనుచరవర్గంతో వచ్చి కుటుంబ సభ్యులపై దాడికి యత్నించినట్లు తెలిసింది. కాంట్రాక్టర్ చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, పర్సెంటేజీ కింద డబ్బులు ఇవ్వడం లేదని కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కాంట్రాక్టర్ ఇంటికొచ్చి హల్‌చల్ చేశాడని తెలిసింది. అడ్డుకోబోయిన కాంట్రాక్టర్ సోదరుడిపై దాడియత్నం చేశాడని ప్రచారం జరుగుతోంది. ఈ సంఘటనకు కాంట్రాక్టర్ కుటుంబ సభ్యులు భయబ్రాంతులకు గురై, పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. కాగా, కొందరు పెద్దల ద్వారా సదరు కార్పొరేటర్ రాజీ కోసం మంతనాలు జరుపుతున్నారని తెలిసింది. ఈ ఘటన బల్దియాలో చర్చనీయాంశంగా మారింది.

క్రీడాకారుల సెలక్షన్ ట్రయల్స్

పెద్దపల్లిరూరల్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరానికి గాను 12నుంచి18 ఏళ్ల మధ్య ఉన్న క్రీడాకారులకు ఈనెల 31, ఫిబ్రవరి 1న సెలక్షన్స్ ట్రయల్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి తిరుపతిరావు తెలిపారు. హైదరాబాద్ సరూర్‌నగర్, ఎల్బీనగర్‌లోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఈ సెలక్షన్ ఉంటుందన్నారు. సెలక్షన్స్ ట్రయల్స్ 12నుంచి 18 ఏళ్ల మధ్యగల క్రీడాకారులకు మాత్రమేనని జిల్లా యువజన క్రీడల అధికారి తెలిపారు. అథ్లెటిక్స్ బాలబాలికలకు (నాన్ రెసిడెన్షియల్ మాత్రమే) హాకీ బాలబాలికలు (రెసిడెన్షియల్), జిమ్నాస్టిక్ బాలబాలికలు (నాన్‌రెసిడెన్షియల్ మాత్రమే) కబడ్డీ బాలురు (రెసిడెన్షియల్, నాన్‌రెసిడెన్షియల్) నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అర్చరీ, అథ్లెటిక్, హాకీ, కబడ్డీ, క్రీడాకారులు జీఎంసీ బాలయోగి స్టేడియానికి సకాలంలో రావాలని సూచించారు.

నెరవేరిన సొంతింటి కల

- మంథనిలో డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభించిన మంత్రి కొప్పుల ఈశ్వర్



మంథనిలో మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

మంథని: ఏళ్లనాటి కల నెరవేరింది. నాలుగేళ్ల ఎదురుచూపులకు ఫలితం దొరికింది. మంథనిలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇండ్లను సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ జిల్లా పరిషత్ చైర్మన్ పుట్టమధు, ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత, మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రెండు పడకగదుల ఇళ్లు ఉచితంగా అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. పుట్టమధు దంపతులు మంథని ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని, వీరిని గుండెల్లో పెట్టుకోవాల్సిన బాధ్యత ఈ ప్రాంత ప్రజలపై ఉందని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ పుట్టమధు మాట్లాడుతూ.. మంథనిలో డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టడం కన్నా.. లబ్ధిదారులకు పంచడం చాలా కష్టమైందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే లబ్ధిదారుల ఎంపికలో రాజకీయం చేసి పంపిణీ ఆలస్యానికి కారణం అయ్యాడని అన్నారు. ఇండ్ల పంపకాలు చేపడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్థానిక ఎమ్మెల్యే అధికారులను బెదిరించడంతోనే కార్యక్రమానికి ఆర్డీవో, తహసీల్దార్ హాజరు కాలేదని అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, టీబీజీకేఎస్ నాయకుడు కెంగర్ల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు. కాగా.. డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీలో అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పలువురు కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

రచ్చపల్లిని ఆదర్శంగా తీసుకోవాలి

సింగరేణిలో నివాసాలు కోల్పోయినవారు తిరిగి ఒకే చోట ఇళ్లు నిర్మించుకుని సంతోషంగా ఉండడం హర్షించదగ్గ విషయమని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం మండలంలోని దుబ్బపల్లి పంచాయతీ భవనం, రచ్చపల్లి ఆర్అండ్ఆర్‌కాలనీలో పంచాయతీ భవనం, వాటర్‌ట్యాంకు, ప్రభుత్వపాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.

ప్రజావాణికి 83 దరఖాస్తులు

- సత్వర పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: 'కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం ముందున్న భూమికి దారి లేకుండా ప్రహరీగోడ నిర్మించారు. నా భూమిలోకి వెళ్లేందుకు మరో మార్గం లేదు. రోడ్డుకు అడ్డంగా నిర్మించిన ప్రహరీని తొలగించి దారి చూపాలని పెద్దపల్లికి చెందిన పినుమల్ల మోహన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుడినైన తనకు ఉండేందుకు ఇల్లు లేదని డబుల్‌బెడ్ రూం ఇల్లు మంజూరు చేయాలని సుల్తానాబాద్‌కు చెందిన కుంచాల శ్రీనివాస్ అభ్యర్థించారు.'.. ఇలా జిల్లాలోని పలు మండలాల నుంచి సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అర్జీలు వెల్లువెత్తాయి. ప్రజావాణి వచ్చిన 83 దరఖాస్తులను కలెక్టర్ సంగీత, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మినారాయణ, కుమార్ దీపక్ స్వీకరించారు. భూ సంబంధమైన ఫిర్యాదులు ఎక్కువగా అందాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓదెల మండలం కొలనూర్ గ్రామంలోని చెరువు ఆక్రమణకు గురైందని సమస్యను పరిష్కరించాలంటూ గ్రామానికి చెందిన బండారి ఐలమ్మ అధికారుల దృష్టికి తేగా ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి ఆర్డీవోను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ప్రసాద్ పాల్గొన్నారు.

'వెంటపడి తరిమే రోజులు ముందున్నాయి'



మాట్లాడుతున్న సోమారపు

గోదావరిఖని: 'ఎమెల్యే చందర్ ఖబడ్దార్.. ఆర్ఎఫ్‌సీఎల్ బాధితులకు డబ్బులు ఇవ్వండి.. లేకుంటే వెంటపడి తరిమే రోజులు ముందున్నాయని' మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సోమారపు సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం స్థానిక శివాజీనగర్‌లో మాట్లాడుతూ.. ఆర్ఎఫ్‌సీఎల్ బాధితులకు డబ్బులు ఇప్పించాలని హితవుపలికారు. ఎన్నికలు ముగిసి నాలుగేళ్లయ్యిందని, ఎక్కడా, ఎప్పుడు రాజకీయాలకు వెళ్లకుండా గెలిచిన ఎమ్మెల్యేకు ఫ్రీహ్యాండ్ ఇచ్చామన్నారు. 39డివిజన్‌లో నాలుగేళ్ల క్రితం రూ.20లక్షల పనులను ప్రారంభించి పెద్దగా గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు తెలుసునని చెప్పుకోవాల్సిన అవసరం లేదన్నారు. నాయకులు వడ్డేపల్లి రాంచందర్, అమరేందర్‌రావు, సోమారపు లావణ్య, కోదాటి ప్రవీణ్, పిడుగు క్రిష్ణ, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వృద్ధాశ్రమానికి శంకుస్థాపన



సుల్తానాబాద్:సుల్తానాబాద్‌లోని మార్కండేయకాలనీలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధాశ్రమానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ శంకుస్థాపన చేయనున్నట్లు డిడబ్ల్యూవో రవుఫ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో ట్రాక్టర్‌తో చదును చేయించారు. జిల్లాకు వృద్ధాశ్రమం నిర్మాణానికి రూ.50 లక్షలు ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, కలెక్టర్ సంగీత, అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, తదితరులు హాజరు కానున్నటు తెలిపారు.

సిరిసిల్ల– సిద్దిపేటకు లైన్ క్లియర్!

- కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేమార్గంలో ముందడుగు
- రెండు పట్టణాల మధ్య ట్రాక్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్
- 30 కి.మీ.కి రూ.440 కోట్ల అంచనా వ్యయం
- బిడ్లు ఆహ్వానించిన దక్షిణ మధ్య రైల్వే
- హైదరాబాద్-సికింద్రాబాద్ డివిజన్ల వారధిగా కరీంనగర్



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ మార్గంలో మరో ముందడుగు పడింది. సికింద్రాబాద్ నుంచి కరీంనగర్ (కొత్తపల్లి) నగరాలను కలిపే అద్భుత ప్రాజెక్టు ఇది. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు తెలంగాణ వచ్చాక పట్టాలెక్కింది. ప్రస్తుతం గజ్వేల్ వరకు ట్రాక్ పనులు పూర్తయి.. ట్రయల్ రన్ నడుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో మరీ కీలక పరిణామం చోటుచేసుకుంది. సిరిసిల్ల–సిద్దిపేట పట్టణాలను కలుపుతూ సుమారు 30 కిలోమీటర్ల దూరానికి బ్రాడ్‌గేజ్ రైల్వేట్రాకు నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే బిడ్లు ఆహ్వానించింది. ఈ పనులకు రూ.440 కోట్ల అంచనా వ్యయాన్ని రూపొందించింది. మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి (కరీంనగర్) వరకు 151.36 మొత్తం కిలోమీటర్ల బ్రాడ్ గేజ్‌లైన్. ఈ మార్గంలో సిద్దిపేట స్టేషన్(77 కి.మీ) -సిరిసిల్ల స్టేషన్ (106.88 కి.మీ) మధ్యన మొత్తం 29.8 కి.మీ ఈ బ్రాడ్ గేజ్ పనులకు రూ.440.288 ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో కాంట్రాక్టు అప్పగించేందుకు దక్షిణ మధ్య రైల్వే బిడ్డింగులను ఆహ్వానించింది.

ప్రాజెక్టు నేపథ్యం ఇదీ..!

వేములవాడ, సిరిసిల్ల, సిద్దిపేట ప్రజలకు రైలు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్న తలంపుతో 2006–07లో 151 కి.మీ.ల కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైనును రూ.1,167 కోట్ల అంచనా వ్యయంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. తరువాత ఈ మార్గం ఆర్థికంగా భారమని చెప్పి చేపట్టేందుకు రైల్వేశాఖ సుముఖత చూపలేదు. మొత్తం బడ్జెట్‌లో 1/3 వంతు ఖర్చుతోపాటు 100 శాతం భూమిని సేకరించి ఇవ్వడం, ఈ మార్గంలో ఐదేళ్లపాటు వచ్చే నష్టాలను భరించేందుకు రాష్ట్రం ముందుకువచ్చింది. దీంతో 2016లో ఈ ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కింది. ఈ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందోనని సిరిసిల్ల, వేములవాడ, కరీంనగర్ ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

మొదలైన ట్రయల్‌రన్..

ప్రస్తుతానికి మనోహరాబాద్– గజ్వేల్ మధ్య 32 కి.మీ. మేర ట్రాక్ పూర్తయి ట్రయల్‌రన్ కూడా నడుస్తోంది. త్వరలోనే మనోహరాబాద్–గజ్వేల్ నూతన రైల్వే మార్గంలో త్వరలోనే రైళ్లు నడిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తాజాగా గజ్వేల్ నుంచి కొడకండ్ల వరకు కొత్తగా నిర్మించిన 9.6 కిలోమీటర్ల రైల్వేలైన్‌ను ఇటీవల రైల్వే సేఫ్టీ కమిషనర్ అభయ్‌కుమార్ రాయ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు కూడా. ఈ రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే కోల్‌కతా, న్యూఢిల్లీ, ముంబై తదితర మహా నగరాలకు ఈ ప్రాంతంతో రైల్ కనెక్టివిటీ పెరుగుతుంది. పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాల వారికి ముంబై, బెంగళూరు, చెన్నై షిర్డీ, తిరుపతికి ఇక్కడి నుంచి రైళ్లు నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసి ఉంచింది.

రెండు డివిజన్లకు వారధిగా ఈ మార్గం..!

దక్షిణ మధ్య రైల్వే డివిజన్ పరిధిలో మొత్తం ఆరు డివిజన్లు ఉండగా అందులో మూడు దక్షిణ కోస్తా పరిధిలోకి వెళ్లాయి. ఇప్పుడు హైదరాబాద్, సికింద్రాబాద్, నాందెడ్ డివిజన్లు సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో ఉన్నాయి. కొత్తపల్లి–మనోహరాబాద్ సెక్షన్ హైదరాబాద్ డివిజన్ పరిధిలో ఉంది. అదే సమయంలో కాజీపేట– బల్లార్ష సెక్షన్ సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉంది. ఈ రెండు డివిజన్లను కలిపే వారధిలా కరీంనగర్ (కొత్తపల్లి) వద్ద మారనుంది. జగిత్యాల, నిజామాబాద్‌తోపాటు నాందెడ్ డివిజన్‌ను కలుపుతూ ఉత్తరాదికి వెళ్లేందుకు.. పెద్దపల్లి, కాజీపేట నుంచి వచ్చే రైళ్లకు కరీంనగర్ కేంద్ర బిందువుగా మారనుంది.

కొత్తపల్లి-మనోహరాబాద్ మార్గం విశేషాలు

విస్తరించి ఉన్న జిల్లాలు: సిద్దిపేట, రాజన్న సిరిసిల్లా, కరీంనగర్.
మార్గం తాకుతూ వెళ్లే గ్రామాలు: 70
రూట్లో మొత్తం రైల్వే స్టేషన్లు: 15
ఈ మార్గంలో పుణ్యక్షేత్రాలు, దర్శనీయ ప్రదేశాలు: వేములవాడ, కొమురవెల్లి, కొండపోచమ్మ, నాచారం లక్ష్మీనర్సింహా స్వామి ఆలయాలు.

మొత్తం పొడవు: 151.36 కి.మీ.
మెదక్ జిల్లాలో..: 9.30 కి.మీ.
సిద్దిపేట జిల్లాలో..: 83.40 కి.మీ.
రాజన్న సిరిసిల్ల జిల్లాలో..: 37.80 కి.మీ.
కరీంనగర్ జిల్లాలో..: 20.86 కి.మీ.
పూర్తిస్థాయిలో పూర్తయిన మార్గం: 42.6 కి.మీ.
రెండో దశలోని గజ్వేల్ టూ దుద్దెడ : 32 కి.మీ.

బాలికల ఆత్మరక్షణకు శిక్షణ

- నేటినుంచి పాఠశాల విద్యార్థులకు కరాటే శిక్షణ
- జిల్లాలోని 90 పాఠశాలల్లో నిర్వహణకు అనుమతి


శిక్షణలో పాల్గొన్న బాలికలు

సుల్తానాబాద్/మంథని: ప్రస్తుతకాలంలో బాలికలకు రక్షణ లేకుండా పోతోంది. కామాంధుల చేతుల్లో ఎందరో పసిమొగ్గలు బలైపోవడాన్ని చూస్తూ ఉన్నాం. ఉదయం ఇంట్లోంచి పాఠశాలకు వెళ్లింది మొదలు సాయంత్రం ఇంటికి వచ్చే వరకు తల్లిదండ్రుల గుండెల్లో గుబులే. ఈ క్రమంలో బాలికల్లో ఆత్మస్థైర్యం పెంచడంతో పాటు ఆపద ఎదురైనప్పుడు తమను తాము రక్షించుకునేందుకు ప్రభుత్వం సరికొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టింది. గతంలో పెద్దపల్లి జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసిన శ్రీదేవసేన పాఠశాల విద్యార్థులకు కథక్ విద్యలో శిక్షణ ఇప్పించగా.. దాన్ని స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే శిక్షణ ఇవ్వాలని ఆలోచన చేసింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నేటినుంచి ప్రారంభిస్తుండగా.. జిల్లాలో 90 పాఠశాలల్లో బాలికలకు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధం అయ్యారు.

8,9వ తరగతి విద్యార్థినులకు

జిల్లాలో 72 జిల్లా పరిషత్ పాఠశాలలు, 10 కేజీబీవీలు, ఎనిమిది ప్రభుత్వ హైస్కూళ్లు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో చదువుతున్న 8,9వ తరగతి బాలికలకు కరాటేలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. గర్ల్స్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్‌లో భాగంగా నెలరోజుల పాటు నిష్ణాతులైన కరాటే మాస్టార్లతో శిక్షణ ఇప్పించనున్నారు. ఈ శిక్షణ బాలికలకు విద్యతో పాటు ఆత్మరక్షణకు దోహదం చేస్తుంది. ఇప్పటికే విద్యాపరంగా గురుకులాలు, ఎస్సీ, బీసీ, మైనార్టీ బాలికల పాఠశాలలతో పాటు కేజీబీవీల్లో ప్రభుత్వం ఉచితంగా చదువు చెప్పిస్తోంది. ఈ క్రమంలో బాలికలపై పెరుగుతున్న దాడులను దృష్టిలో ఉంచుకుని కరాటేలో శిక్షణ ఇప్పించాలని సంకల్పించింది. ఈ మేరకు పాఠశాల విద్యా సంచాలకులు, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. నెల రోజుల పాటు ఆత్మరక్షణ విద్యలో శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఇందు కోసం తగిన అర్హతలున్న ఏజెన్సీలను సైతం ఎంపిక చేశారు.

నేటినుంచి ప్రారంభం

ఈనెల 24 నుంచి శిక్షణను ప్రారంభించనున్నారు. ఇప్పటికే మండలస్థాయిలో ఉన్న ఎంఈవోలకు కరాటే శిక్షణ ఇచ్చేందుకు స్థానికంగా ఉన్నవారికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. శిక్షణ ఇచ్చినవారికి రూ.5వేల గౌరవవేతనం అందించనున్నారు. పాఠశాలల్లో చదువులకు ఇబ్బంది లేకుండా పాఠశాల పని సమయం ముగిసిన అనంతరం, చివరి గంటలో శిక్షణ తరగతులు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తారని బాలికల విద్యాధికారి అనురాధ వివరించారు.

ఆత్మవిశ్వాసం పెరుగుతుంది



కరాటే ప్రత్యేక శిక్షణతో బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఈ శిక్షణ అందించేలా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. వాటిని ఎంఈవోలకు చేరవేశాం. కరాటే నేర్చుకోవడంతో అనుచిత పరిస్థితుల్లో బాలికలు తమనుతాము రక్షించుకునే అవకాశం ఉంటుంది. ఇందుకు సంబంధించిన పాఠశాలల ఎంపిక జరిగింది. నిపుణులైన వారితో నెలరోజుల పాటు తరగతులు నిర్వహిస్తాం.
– అనురాధ, బాలికల విద్యాధికారి, పెద్దపల్లి

అధికారులు సంప్రదించారు



జిల్లావ్యాప్తంగా ఉన్న బాలికల పాఠశాలల్లో కరాటే శిక్షణ ఇచ్చేందుకు అధికారులు ఇప్పటికే మమ్మల్ని సంప్రదించారు. ఈనెల 24 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభించాలని సూచించారు. కరాటే మాస్టార్ల వివరాలు ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించి వారికి వివరాలు అందిస్తాం. – మల్యాల రామస్వామి,
కరాటే అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, పెద్దపల్లి

క్లుప్తంగా

పాఠశాల స్థాయి నుంచే అలవర్చుకోవాలి


హర్షితను అభినందిస్తున్న మంత్రి కొప్పుల

యైటింక్లయిన్‌కాలనీ: విద్యార్థులు పాఠశాల స్థాయి నుండే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. రామగిరి మండలం చందనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి డి. హర్షిత రూపొందించి ప్రాజెక్ట్ జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా సోమవారం దుబ్బపల్లి జీపీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొని జెడ్పీచైర్మన్ పుట్టమధుతో కలిసి హర్షితను శాలువతో సన్మానించి అభినందించారు. ఆమెను ప్రోత్సహించిన గైడ్ టీచర్ సంపత్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, టీచర్లు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకన్న

రామగిరి(మంథని): ఈనెల 29న కొత్తగూడెంలో నిర్వహించే ఐఎఫ్‌టీయూ 7వ మహాసభలను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆకుల వెంకన్న కోరారు. సింగరేణి సంస్థ ఆర్జీ3 పరిధిలోని వివిధ డిపార్ట్‌మెంట్‌లలో సోమవారం మహాసభల పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మహాసభల్లో భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మహాసభలను సింగరేణి వ్యాప్తంగా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు ఎస్.ఓదెమ్మ, రాధ, విజయ, శాంత, భాగ్య, సరోజన, రాజ్యలక్ష్మి, శ్యామల, పద్మ, మల్లేశ్, వెంకటేశ్, సురేశ్, లక్ష్మి, తిరుమల, లలిత, బానమ్మ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


మొండయ్య (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన రేవెల్లి మొండయ్య(38) అనారోగ్యం పాలై మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం పురుగుల మందు దాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య మధునమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాల్వశ్రీరాంపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


పెద్దపల్లిలో జేఏసీ మానవహారం


బస్టాండ్ అంబేద్కర్ వద్ద మానవహారంగా ఏర్పడిన జేఏసీ నాయకులు

పెద్దపల్లిరూరల్: అశాస్త్రీయ విధానాలను ప్రశ్నిస్తున్న వారిపై మతం ముసుగులో అరాచకశక్తులు భౌతికదాడులకు దిగడాన్ని నిరసిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో పెద్దపల్లి బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. విప్లవరచయితల సంఘం ఉమ్మడి జిల్లా బాధ్యుడు బాలసాని రాజయ్య, టీపీఎఫ్ జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య, ప్రజాఫ్రంట్ జిల్లా కమిటీ సభ్యుడు గాండ్ల మల్లేశం, నాయకులు కల్లెపల్లి అశోక్, రవీందర్, ప్రశాంత్, రాయమల్లు, లింగమూర్తి, సురేశ్, భారతి, కనకయ్య, శ్రీమాన్ తదితరులు మానవహారంగా ఏర్పడ్డారు. దళిత ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై అరాచకశక్తులు అకారణంగా దాడిచేయడాన్ని ఖండించారు. రాజకీయ ముసుగులో జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక వాదులు, మేధావులు పోరాడాలన్నారు. దాడులకు పాల్పడుతున్న అరాచకవాదులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నీరుగారుస్తున్న సీఎం

- వైఎస్.రాజశేఖరరెడ్డి ఆశయానికి గండి
- నిరుపేద విద్యార్థులను ఆదుకోవాలని
- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నగేశ్


డాక్టర్ కె.నగేశ్

చొప్పదండి: స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి పేద విద్యార్థుల కోసం, వారి ఉజ్వల భవిష్యత్ కోసం ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని సీఎం కేసీఆర్ నీరుగారుస్తున్నాడని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్ విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2020-21 విద్యా సంవత్సరానికి రూ.650 కోట్లు పెండింగ్ బకాయిలున్నాయని, 2021-22 సంవత్సరానికి రూ.2,250 కోట్లు బకాయి ఉన్నాయన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి రూ.2,400 కోట్లు బకాయిలున్నాయని, మూడేళ్లుగా 18 లక్షల మంది నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించడంలేదని విమర్శించారు. ప్రైవేటు విద్యాసంస్థలకు రూ. 5వేల కోట్లు చెల్లించకపోవడంతో నిరుపేద విద్యార్థుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రూ. ఐదు లక్షల కోట్లు అప్పుతెచ్చి విద్యార్థులను విస్మరించారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో పూర్తిగా విఫలమైందని, బడ్జెట్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు కేటాయించిన నిధులు ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

బీసీ జనాభా లెక్కలు చేపట్టాలి

- తెలంగాణ లేబర్ పార్టీ అధ్యక్షుడు గొర్రె రమేశ్


నిరాహార దీక్ష చేస్తున్న గొర్రె రమేశ్

గోదావరిఖని: శాసనసభ ఎన్నికల ముందే రాష్ట్ర ప్రభుత్వం బీసీ జనాభా లెక్కలు చేపట్టాలని తెలంగాణా లేబర్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో నిరాహార దీక్ష చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం 2023లో ప్రవేశపెడుతున్న రూ. 3 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు రూ.1.60 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. బీసీ జనాభా లెక్కల ప్రకారం రాబోయే శాసనసభ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 60శాతం సీట్లు బీసీలకు కేటాయించాలని డిమాండ్‌చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీల రిజర్వేషన్లు పెంచాలన్నారు. 2014 నుంచి 2020 వరకు బీసీల కోసం కేటాయించిన రూ.2,139 కోట్లు విడుదల చేయాలన్నారు. నిరాహార దీక్ష చేపట్టిన రమేశ్‌ను హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మహంకాళిస్వామి తదితరులు దీక్షాశిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. దీక్షలో నాయకులు పిడుగురాళ్ల సంతోష్, అల్లప్ప తిరుపతి, గాజుల రమేశ్, జీఎస్. రావు, సుగుణాకర్‌రెడ్డి, జక్కం కవిత తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

యైటింక్లైన్ కాలనీ: ఈనెల 29న కొత్తగూడెంలో నిర్వహించే 7వ రాష్ట్రస్థాయి మహాసభలను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ కోరారు. సోమవారం ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలో ఐఎఫ్‌టీయూ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు నరేశ్, కాంట్రాక్ట్ కార్మికులతో కలసి రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐఎఫ్‌టీయూ ముందుండి పోరాడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 7వ మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, బుచ్చమ్మ., మొగిలి, లింగయ్య, కాంతయ్య, పోశం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవాసవి కన్యకా పరమేశ్వరికి పూజలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి స్థానిక చిలుకలయ్యగుడిలో మహిళలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు రావికంటి ఈశ్వర్, అధ్యక్షుడు రావికంటి అంజయ్య, కోశాధికారి రావికంటి హరీశ్, ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి రాజు రాచర్ల చంద్రశేఖర్, గాదంశెట్టి రమేశ్, గౌరిశెట్టి శ్రీనివాస్, కొమరవెల్లి రమేశ్, గంప మల్లేశం, కట్కూరి రమేశ్, నల్ల అశోక్ పాల్గొన్నారు.

పిల్లల వైద్యానికి ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేయాలి

- టీబీజీకేఎస్ నాయకుల వినతి


కవితకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఆస్పత్రుల్లో చిన్నారుల వైద్యం కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని యువ కార్మికులు కోరారు. ఈ మేరకు టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు వినతి పత్రం అందించారు. సంస్థలో ప్రస్తుతం 25వేల మందికి పైగా యువ కార్మికులున్నారని, ఈక్రమంలో చిన్నారుల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. వారికి సరైన వైద్యం అందించేలా యాజమాన్యం దృష్టికి తేవాలని కోరారు. పిల్లల వైద్యం కోసం రెఫరల్ ఆసుపత్రులు నిమ్స్, రెయిన్‌బో, టారిఫ్‌లను సవరించి రిఫరల్ లిస్టులో చేర్చాలన్నారు. సంస్థలో అంతర్గత పదోన్నతులు వెంటనే వచ్చేలా చూడాలన్నారు. సింగరేణిలోని ఇంటర్నల్ పరీక్షలు చాలాఏళ్లుగా ఇంగ్లీషులో నిర్వహిస్తున్నారని, తెలుగులో కూడా నిర్వహించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో చెల్పూరి సతీశ్, సాధుల సంతోష్, రత్నాకర్‌రెడ్డి, రత్నం అవినాశ్, నరేశ్ నేత, రవియాదవ్, బొగ్గుల సాయికృష్ణ, పర్శురాం తదితరులు పాల్గొన్నారు.

భూమి రిజిస్ట్రేషన్‌కు వచ్చి... మృత్యువు ఒడిలోకి


వీరయ్య(ఫైల్)

మానకొండూర్‌రూరల్: మండలంలోని కెల్లేడు గ్రామానికి చెందిన కందుల వీరయ్య(74) తన పేరుపై ఉన్న వ్యవసాయ భూమిని కుమారుల పేరుపై మార్చేందుకు సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి కుమారులతో కలిసి వెళ్లాడు. వీరయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని కుమారులు తహసీల్దార్ లక్ష్మారెడ్డికి తెలిపారు. దీంతో వీరయ్య వేలిముద్రలు తీసుకునేందుకు తహసీల్దార్ స్వయంగా ఆటో వద్దకు వెళ్లి వేలిముద్ర తీసుకుని వెళ్తుండగా వీరయ్య ఆరోగ్యంపై అనుమానం వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో అతడిని కుమారులు, బంధువులు మండలకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సలహాతో అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు వీరయ్య మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించినట్లు సమీప బంధువులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

సింగరేణి వార్తలు

లక్ష్యసాధనలో ఉద్యోగుల తీరు భేష్

- ఆర్జీ-1 జీఎం కె.నారాయణ


కార్మికులనుద్దేశించి ప్రసంగిస్తున్న జీఎం

గోదావరిఖని: సమష్టి కృషితో 69 రోజుల ముందుగానే జీడీకే-5 ఓసీపీ వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించామని ఆర్జీ-1 జీఎం కె.నారాయణ అన్నారు. సోమవారం సైట్‌ఆఫీస్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు 25లక్షల బొగ్గు ఉత్పత్తి టార్గెట్‌గా నిర్దేశించగా 69 రోజుల ముందుగానే లక్ష్యం సాధించడం అభినందనీయమన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధిస్తూ ఇదేస్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా న్యూఇయర్ క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, ప్రాజెక్టు ఇంజినీర్ ఎస్.వెంకటేశ్వర్‌రావు, ప్రాజెక్టు మేనేజర్ గోవిందరావు, కాలరీస్ మేనేజర్ అనిల్‌గబాలే తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరందించాలి


ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్

గోదావరిఖని: కార్మిక కుటుంబాలకు సింగరేణి యాజమాన్యం స్వచ్ఛమైన తాగునీరందించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఏటా రూ.వందల కోట్ల లాభాలను ఆర్జిస్తోన్న సింగరేణి యాజమాన్యం కార్మికకుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరందికపోవడం శోచనీయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో పెరుగుతున్న రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. నామమాత్రంగా కొన్ని వాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేసి యాజమాన్యం చేతులు దులుపుకుందన్నారు. శాశ్వత రాపిడ్ గ్రావిటీ వాటర్ ప్లాంట్లు నిర్మించాలని అది పూర్తయ్యేవరకు వాటర్ ట్యాంకర్లతో కార్మికవాడల్లో మంచి నీరందించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీజీఎం పర్సనల్ లక్ష్మినారాయణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, సిద్దంశెట్టి రాజమౌళి, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, వికాస్‌కుమార్‌యాదవ్, వడ్డేపల్లిదాస్, గడ్డం కృష్ణ, టైసన్ శ్రీనివాస్, కె.సదానందం, అక్బర్‌అలీ, రవీందర్‌రెడ్డి, దేవిభూమయ్య, ఎట్టెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరందించేందుకు ఏర్పాట్ల పరిశీలన

- సింగరేణి డైరెక్టర్ ఎన్.బలరాం


గోదావరినదిలో పరిస్థితి తెలుసుకుంటున్న డైరెక్టర్ బలరాం

గోదావరిఖని: ఖర్చుకు వెనకాడకుండా సింగరేణి ఉద్యోగుల కుటుంబాలకు స్వచ్ఛమైన తాగు నీరందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సింగరేణి ఫైనాన్స్ డైరెక్టర్ బలరాం సూచించారు. సోవారం గోదావరినది వద్ద కార్మిక వాడలకు సరఫరా అవుతున్న ఇంటెక్‌వెల్‌ను పరిశీలించారు. పూణే నుంచి వచ్చిన స్క్యూబాడైవర్స్‌తో మాట్లాడారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మించిన తర్వాత నీటినిల్వలు పెరిగి ఇన్‌ఫిల్టరేషన్ గ్యాలరీలు దెబ్బతిన్నాయన్నారు. బురదమట్టి ఇంటెక్‌వెల్‌లోకి వెళ్లడంతో నీరు ఫిల్టర్ కావడం లేదన్నారు. దీన్ని మరమ్మతులు చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. 20మీటర్ల లోతు నీటిలో పేరుకుపోయిన ఇసుకను, బురద మట్టిని మడ్‌పంపుల ద్వారా వెలికి తీస్తున్నట్లు వెల్లడించారు. పరిశుభ్రమైన తాగునీరందించేందుకు శాశ్వత ప్రతిపాదికన ఏర్పాట్లుచేస్తున్నామన్నారు. ఆయనవెంట ఆర్జీ-1 జీఎం కె.నారాయణ, క్వాలిటీ ఏజీఎం ప్రసాద్‌రావు, డీజీఎం సివిల్ నవీన్, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తదితరులున్నారు.

సీఎంపీఎఫ్ చిట్టీలు అందించాలని ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గోదావరిఖని సీఎంపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఐదేళ్లుగా చిట్టీలు రాకపోవడంతో కాంట్రాక్టు కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి చిట్టీల పంపిణీలో జోక్యం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దూలం శ్రీనివాస్, గట్టు మహేందర్, చిప్పకుర్తి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.